క్లుప్తంగా

విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన



ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్న సీఐ లక్ష్మణరావు

సాక్షి ఫొటోగ్రాఫర్ / ఏలూరు : ఏలూరులోని ట్రాఫిక్ పార్కులో ప్రతిరోజూ విద్యార్థులకు ట్రాఫిక్ సిగ్నల్స్, జీబ్రాలైన్, లెఫ్ట్ సిగ్నల్, రైట్ సిగ్నల్, స్పీడ్ బ్రేకర్, ముందు సూచికగా ఇచ్చే టర్నింగ్స్‌పై అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థులకు ట్రాఫిక్‌పై ఏలూరు సిటీ ట్రాఫిక్ సీఐ ఎస్ లక్ష్మణరావు అవగాహన కల్పించారు.

నేడు కల్లుగీత కార్మిక సంఘం జిల్లా సమావేశం

ఏలూరు (టూటౌన్): ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం ఏలూరు జిల్లా సమావేశం మంగళవారం ఉదయం 10 గంటలకు ఏలూరు నరసింహారావు పేటలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న సీఐటీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించనున్నట్టు ఆ సంఘం ఏలూరునగర నాయకులు సొంటి శంకరరావు, బెజవాడ వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా సంఘం రాష్ట్ర కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి హాజరవుతున్నారని, సంఘీయులందరూ పాల్గొనాలని వారు కోరారు.

ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): బల్గేరియా, అల్బేనియా దేశాల్లో ఉద్యోగాల నిమిత్తం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్ జితేంద్ర బాబు ఒక ప్రకటనలో తెలిపారు. మెకానికల్ డిజైన్ ఇంజినీర్లు, ఫ్యాక్టరీ మెకానిక్స్, ఫ్యాక్టరీ ఎలక్ట్రీషియన్లకు యూరప్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించే అంతర్జాతీయ నియామక కార్యక్రమాన్ని ప్రకటించాయన్నారు. పూర్తి వివరాలకు అభ్యర్థులు హెల్ప్‌లైన్ నంబర్ +91-9988853335లో సంప్రదించవచ్చని, ఈ నెల 23తో దరఖాస్తు గడువు ముగుస్తుందని పేర్కొన్నారు.

అవినీతిపై దర్యాప్తునకు డిమాండ్

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ సాంబశివరావు, ఇతర సిబ్బంది అవినీతిపై సమగ్ర దర్యాప్తు చేసి సస్పెండ్ చేయాలని దళితసేన విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (జీపీఆర్ఎస్) కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డిని దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షులు జిజ్జువరపు రవి ప్రకాష్, నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు.

నిషేధాన్ని మీరి.. యథేచ్ఛగా

- నిబంధనలకు విరుద్ధంగా ఎల్‌ఈడీ బల్బుల వినియోగం
- నిషేధాన్ని పట్టించుకోని వాహనచోదకులు
- అధిక కాంతితో కంటి చూపు సమస్యలు
- స్పందించని అధికారులు





ఎదుటి వారి కళ్లలోకి నేరుగా పడుతున్న వాహనాల ఎల్‌ఈడీ లైట్ల వెలుగులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ద్విచక్రవాహనాలు, ఆటోలు, చిన్నకార్లు వంటి వాహనాల హెడ్‌లైట్లకు ఎల్‌ఈడీ బల్బులను అమర్చుకోవడం నిబంధనలకు విరుద్ధం. 2020 మార్చి నెలలో అమలులోకి వచ్చిన బీఏ 6 వాహనాల వినియోగంతో పట్టపగలు కూడా రహదారిపై వెళ్లే వాహనాలకు లైట్లు వెలుగుతూనే ఉన్నాయి. అన్ని వాహన తయారీ సంస్థలూ తప్పనిసరిగా పగలు కూడా వెలిగేలా లైట్ల అమరిక చేయాలని నిబంధన ఉండడంతో ఐదేళ్లుగా కొత్తగా రహదారులపైకి వస్తున్న వాహనాలకు పగలు కూడా లైట్లు వెలుగుతూనే ఉన్నాయి. కొందరు ఆకతాయిలు వాహన తయారీ సంస్థలు హెడ్‌లైట్లలో బిగించిన బల్బులను తొలగించి ఎక్కువ కాంతి వచ్చే ఎల్‌ఈడీ బల్బులను తమ వాహనాలకు వినియోగిస్తున్నారు. ఇది ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఎక్కువ కాంతినిచ్చే ఎల్‌ఈడీ బల్బుల వినియోగంపై ఉన్న నిషేధం ఎక్కడా అమలు జరగడంలేదు.

కళ్లలోకి నేరుగా కాంతి

వాహనాల తయారీ సంస్థలు తమ వాహనానాకి అమర్చే హెడ్‌లైట్ వెలుగులు ఎదురుగా వచ్చే వాహనచోదకులకు, పాదచారులకు ఇబ్బంది కలిగించే విధంగా ఉండకుండా చూసుకుంటారు. అయితే వాహనాలను కొనుగోలు చేసిన వారు మాత్రం వాటిని మార్చి ఎక్కువ కాంతి ఇచ్చే బల్బులు వినియోగిస్తుండడంతో ఎదురుగా వచ్చే వాహనచోదకుల కళ్లలోకి నేరుగా వెలుగులు ప్రసరించి, ఎదురుగా ఏం జరుగుతుందో గ్రహించే లోపే ప్రమాదాలబారిన పడుతున్నారు. కొన్నిసార్లు రోడ్డుపై ఉన్న గుంటలు కనిపించకపోవడం, మరి కొన్ని సార్లు ఎదురుగా వచ్చే చిన్నచిన్న వాహనాలు కనిపించకపోవడం, ఇంకొన్ని సార్లు రోడ్లపై నిలిచి ఉండే కుక్కలు, గోవులు వంటి జంతువులు కనిపించక వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. కొన్నిసార్లు మృత్యువాత పడుతున్నారు. అధిక కాంతి ఇచ్చే ఎల్‌ఈడీ లైట్ల వెలుగు ఎదురుగా వచ్చే వాహనచోదకులు, పాదచారుల కళ్లలోకి నేరుగా పడుతుండడంతో తమ చూపు మందగిస్తోందని పలువురు ఆందోళన చెందుతున్నారు.

అధికారుల ఉదాశీనత

రహదారిపై నిబంధనలకు వ్యతిరేకంగా వాహనాలను తిప్పే యజమానులపై ట్రాఫిక్ పోలీసులు లేదా రవాణా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి. ఈ మధ్యకాలంలో రవాణా శాఖ ఉపరవాణా కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన షేక్ కరీం వాహనాల నిర్వహణపై అనేక చర్యలు తీసుకున్నారు. ఎక్కువ ధ్వనివచ్చే సైలెన్సర్లను తొలగించడం, ఆటోలు, ఇతర వాహనాలకు తయారీ సంస్థ ఇచ్చిన దానికంటే అధికంగా ముస్తాబు చేసిన వాహనాలపై కొరడా ఝుళిపించడం వంటి చర్యలు చేపట్టారు. అయితే ఇటీవల రవాణా శాఖాధికారుల్లోనూ, ట్రాఫిక్ పోలీసుల్లోనూ ఉదాశీన వైఖరి కనిపిస్తుండడంతో వాహనాలకు నిషేధిత ఎక్కువ కాంతి వచ్చే బల్బుల వినియోగం పెచ్చుమీరింది. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఏలూరులో సుమారు ఒక లక్ష ద్విచక్ర వాహనాలు, సుమారు 600 ఆటోలు రోడ్లపై తిరుగుతున్నట్టు అంచనా.

ఇతర లైట్లు వాడితే వారంటీ పోతుంది



ద్విచక్ర వాహనాలకు తయారీ సంస్థలు ఇచ్చే హెడ్‌లైట్లలో రాత్రి వేళల్లో ఎదురుగా వచ్చే వాహన చోదకులకు ఇబ్బందికరంకాని హెలజీన్ లాంప్స్‌తో పాటు ప్రాజెక్టర్ హెడ్‌లాంప్స్‌ని కూడా వాహనాల్లో ఇస్తున్నాయి. అయితే కొందరు వినియోగదారులు వాటిని మార్చుకుని వేరేవి వాడడం వల్ల వాహనం పనితీరు దెబ్బతింటుంది. బ్యాటరీపై లోడ్ ఎక్కువై వాహనం పనితీరు తగ్గిపోతుంది. ఇతర లైట్లు వినియోగించడం వల్ల వినియోగదారులు కంపెనీ ఇచ్చే వారంటీని కూడా కోల్పోతారు.

– ఏపీ సోమేశ్వరరావు, జనరల్ మేనేజర్, సాయి స్వర్ణ హీరో షోరూమ్

చర్యలకు జేసీ హామీ



ఆటోలు, మోటారు సైకిళ్లకు అధికంగా కాంతి వచ్చే ఎల్‌ఈడీ లైట్లు వాడుతున్న కారణంగా ఎదుటి వ్యక్తి కంటికి ఏమీ కనిపించడం లేదు. దీంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. దీనిపై గతంలో చాలాసార్లు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదులు చేశాం. అయినప్పటికీ సంబంధిత అధికారులు స్పందించలేదు. ఈ సోమవారం మరోసారి ఫిర్యాదు చేశాం. ఫిర్యాదు స్వీకరించిన జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

– ఎండీ ఇస్మాయిల్ షరీఫ్, సామాజిక కార్యకర్త

రక్షణ సైన్యం ఆవిర్భావ ర్యాలీ



ఏసురాజ్యం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ర్యాలీ

ఏలూరు(ఆర్‌ఆర్‌పేట): రక్షణ సైన్యం 1895లో జూలై 21న విజయవాడ కేంద్రంగా తెలుగు రాష్ట్రాల్లో ఆవిర్భవించిన రోజును పురస్కరించుకుని సోమవారం రక్షణ సైన్యం చర్చి నుంచి పలు వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. డివిజనల్ కమాండర్ మేజర్ ఏసురాజ్యం, లతమ్మ ఆధ్వర్యంలో కోర్ ఆఫీసర్లు జిల్లా వ్యాప్తంగా రక్షణ సైన్యం, సంఘస్తులు, యువత, ఉపాధ్యాయులు సంఘ జెండాను పట్టుకుని ర్యాలీ నిర్వహించారు.

కేరళ మాజీ సీఎం మృతికి సంతాపం

ఏలూరు (టూటౌన్): కేరళ మాజీ ముఖ్యమంత్రి, రాజకీయ కురు వృద్ధుడు, సీపీఎం నేత కామ్రేడ్ వీఎస్ అచ్యుతానందన్ మృతికి సీపీఐ ఏలూరు జిల్లా సమితి ఒక ప్రకటనలో తీవ్ర సంతాపం తెలిపింది. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు అచ్యుతానందన్ మృతి సీపీఎంకి తీరనిలోటని, ఆయన మరణం కేరళ కమ్యూనిస్టు ఉద్యమానికి పూడ్చలేని లోటని పేర్కొన్నారు. అచ్యుతానందన్ మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ సోమవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.

కొల్లేరు సమాచారం అందించండి



కలెక్టర్ వెట్రిసెల్వికి వినతిపత్రం అందిస్తున్న జెడ్పీటీసీ సరస్వతి

ఏలూరు(మెట్రో): కొల్లేరు సరస్సు సమాచారాన్ని తమకు ఇప్పించాలని జెడ్పీటీసీ మండల సరస్వతి కొండలరావు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందించారు. సుప్రీంకోర్టుకు సమర్పించిన కాంటూరులో పేర్కొన్న సర్వే నంబర్లు, వాటి విస్తీర్ణం, అదేవిధంగా కాంటూరు సర్వేతో పాటుగా, 5వ కాంటూరు వరకు ఉన్న వివరాలు అందించాలని కోరారు. కొల్లేరుకు సంబంధించి 120 జీఓ ఇచ్చారని, 1999లో జీఓను ఫారెస్టు, రెవెన్యూ శాఖకు అందించిందో, రెవెన్యూ , ఫారెస్టు శాఖకు అందించిందో తెలియజేయాలని కోరారు. లేడార్ సర్వే వల్ల ఉపయోగాలేమిటో వాటిని తెలియజేయాలని సరస్వతి కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

ఉపాధి లేదు.. పరిహారం అందదు

- కాంటూర్‌లతో కాలక్షేపం చేస్తున్న ప్రభుత్వం
- ఉపాధి లేక అవస్థలు పడుతున్న నిర్వాసిత కూలీలు
- పనుల కోసం నిత్యం దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన
- ఆర్‌అండ్‌ఆర్ పరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్



పరిహారం ఇచ్చిన భూముల్లో జామాయిల్ సాగు చేస్తున్న దృశ్యం

కుక్కునూరు: పాలకుల పాపం నిర్వాసితుల పాలిట శాపంలా తయారైంది. పోలవరం ప్రాజెక్ట్ పరిహారం ఇవ్వక, ఇటు పనుల్లేక ఉపాధి కోసం పొట్టచేత పట్టుకుని నిర్వాసితులు పక్క రాష్ట్రాలకు వలస బాట పడుతున్నారు. వివరాల్లోకి వెళితే... రాష్ట్ర విభజన సమయంలో పోలవరం ప్రాజెక్ట్ పేరుతో కుక్కునూరు, వేలేరుపాడు మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేశారు. విలీనం అనంతరం అప్పటి ప్రభుత్వం 2016–2017వ సంవత్సరంలో భూసేకరణ చేపట్టి పరిహారం చెల్లించింది. కానీ ఆర్‌అండ్‌ఆర్ పరిహారం మాత్రం చెల్లించలేదు, 2019 కల్లా ఆర్‌అండ్‌ఆర్ పరిహారం చెల్లించి పునరావాస కేంద్రాలకు తరలిస్తామన్న అప్పటి ప్రభుత్వ పెద్దల మాటలతో మండలంలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. అప్పటికే ముంపు పేరుతో అరకొరగా జరుగుతున్న నిర్మాణ రంగ పనులు పూర్తిగా మందగించాయి. దీంతో భవన నిర్మాణ కార్మికులు ఉపాధి లేక పస్తులుండే పరిస్థితి ఏర్పడింది. ఇలా దిక్కుతోచని స్థితిలో భవన నిర్మాణ కార్మికులు వలస బాట పట్టారు.

జాబితాలో పేర్లు తొలగిస్తారన్న భయం

ఉపాధి కోసం నిర్వాసితులు నిత్యం కుక్కునూరు నుంచి తెలంగాణలోని భద్రాచలం, అశ్వారావుపేట, పాల్వంచ, కొత్తగూడెం తదితర ప్రాంతాలకు వెళ్తున్నారు. ఉపాధి కోసం రాకపోకలు సాగిస్తున్న నిర్మాణ రంగ కూలీలు తప్పకుండా కుక్కునూరులోనే ఉండాల్సిన పరిస్థితి.. లేదంటే గతంలో అలా పనులకు వెళ్లిన వారి పేర్లను స్థానికంగా ఉండడంలేదన్న సాకుతో ఆర్‌అండ్‌ఆర్ జాబితా నుంచి తొలగించినట్టే తమ పేర్లు తొలగిస్తారన్న భయం నిర్వాసితులను వెంటాడుతోంది. మరో పక్క భూములకు పరిహారం చెల్లించడంతో పరిహారం పొందిన రైతులు ప్రభుత్వం సేకరించిన భూముల్లో పెద్దెత్తున జామాయిల్ సాగును ప్రారంభించారు. దీని కారణంగా రైతు కూలీలకు ఉపాధి గండం ఏర్పడింది. దీంతో ఏమి చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో భవన నిర్మాణ కూలీలు, రైతు కూలీలు అర్ధాకలితోనే దొరికిన పని చేసుకుంటూ బతుకునావను సాగిస్తున్నారు. ఇలా ఇబ్బందులు పడుతున్న నిర్వాసితులకు ప్రభుత్వం ఆర్‌అండ్‌ఆర్ పరిహారం ఇచ్చి పునరావాస కాలనీలకు తరలించకుండా 41 కాంటూర్, 45 కాంటూర్ అంటూ విడదీసి ఇంకా పరిహారం చెల్లించకుండా కాలయాపన చేస్తోందే తప్ప నిర్వాసితుల ఇబ్బందులను పరిగణలోకి తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇకనైనా కాంటూర్‌లంటూ కాలయాపన లేకుండా ముంపునకు గురవుతున్న గ్రామాలన్నింటికీ పరిహారం చెల్లించాలని నిర్వాసితులు డిమాండ్ చేస్తున్నారు.

సగం కూలి డబ్బులు చార్జీలకే



కుక్కునూరు మండలంలో సిమెంట్ పనులు లేక నిత్యం అశ్వారావుపేట మండలం వినాయకపురం వెళ్లి పనులు చేస్తున్నాం. రోజూ వచ్చే కూలిలో సగం చార్జీలకే సరిపోతుంది. పోలవరం ప్రాజెక్ట్ పేరుతో ప్రభుత్వం పరిహారం ఇవ్వకపోవడంతో ఉన్న ఊర్లో పనుల్లేక వేరే ఊర్లకి ఉపాధి కోసం వెళ్లాల్సి వస్తోంది.

– కె.హరి, భవన నిర్మాణ రంగ కార్మికుడు, కుక్కునూరు

మా కష్టాలు దేవుడికెరుక



ఉపాధి పనులు లేక రోజూ ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే ఎంత ఇబ్బందో అనుభవించే మాకు మాత్రమే తెలుసు. నిత్యం పనికోసం ఎండా, వాన, చలిలో విపత్కర పరిస్థితులను ఎదుర్కొని దాదాపు 100 కి.మీ వెళ్లి రావాల్సి వస్తుంది. అలా వెళ్లి రావడానికి మేము పడుతున్న ఇబ్బందులు ఆ దేవుడికెరుక. ఇకనైనా ప్రభుత్వం మాకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

– ఎస్డీ. బాలుషా, భవన నిర్మాణ రంగ కూలి, కుక్కునూరు

పనుల కోసం ఖమ్మం వెళ్తున్నాం



పోలవరం ప్రాజెక్ట్ పేరుతో ప్రభుత్వం నిర్వాసితులకు పరిహారం ఇవ్వకుండా.. అసలు ఇస్తారా లేదా అని తేల్చకపోవడంతో నిర్మాణ పనులు చేయాలా లేదా అని నిర్వాసితులు మీమాంసలో ఉన్నారు. దీంతో నిర్వాసిత మండలాల్లో పనుల్లేక 200 కి.మీ. దూరంలో ఉన్న ఖమ్మం వెళ్లి పనులు చేస్తున్నాం.

– షేక్ సలీం పాషా, భవన నిర్మాణ మేస్త్రి, కుక్కునూరు

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	36	అరటి కాయ (1)	06–08
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	40
వంకాయలు (కాంతులు)	24	బిళ్లచిక్కుడు	100
వంకాయలు (తెలుపు)	36	చామదుంపలు	36
బెండకాయలు	24	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	76	కంద	60
కాకర కాయలు	34	బీట్‌రూట్	38
బీరకాయలు	24	కీరా దోస	50
బీరకాయలు (పందిరి)	30	ఫ్రెంచ్‌బీన్స్	90
క్యాబేజీ	26	అల్లం	60
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	30	పాలకూర	12
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	26	చుక్కకూర	12
గోరుచిక్కుడు	40	గోంగూర	07–10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	10–15	క్యాప్సికమ్	90
పొట్లకాయ(1)	25–30	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	30
ఏలూరు – జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	35
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	41
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	16
ఏలూరు – అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో 22సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	31
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.15	4822	33
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	30
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	27
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	29
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	35
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	33
ఏలూరు – తిరుపతి	16.00	4830	32

మహిళల సమస్యలపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్, సీఐ అశోక్‌కుమార్

ఏలూరు టౌన్: సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేయాలని డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ అన్నారు. ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఆదేశాల మేరకు టూటౌన్ సీఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్ పరిధిలోని మహిళా సంరక్షణ కార్యదర్శులతో సోమవారం రాత్రి ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. మహిళల భద్రత, సంక్షేమం, సామాజిక సాధికారితపై అవగాహన కల్పించేందుకు, వార్డు స్థాయిలో మహిళల సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేశామని డీఎస్పీ తెలిపారు. మహిళల సమస్యలను గుర్తించి వెంటనే పోలీస్ అధికారులకు తెలియజేస్తూ న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. శక్తియాప్ వినియోగం, పోక్సో చట్టం, గృహ హింస నివారణ చట్టం, ఇతర మహిళా రక్షణ చట్టాలపై మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. వార్డు స్థాయిలోనే మహిళలకు సత్వర న్యాయం అందించేందుకు మహిళా సంరక్షణ కార్యదర్శులు కృషి చేయాలని చెప్పారు. సమావేశంలో ఏలూరు టూటౌన్ ఎస్సై మధు వెంకట రాజు, మహిళా ఎస్సై నాగ కళ్యాణి, సిబ్బంది ఉన్నారు.

కంటివైద్య పరీక్షలు

దెందులూరు: విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచి కళ్ల పరిరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని చాటపర్రు పీహెచ్‌సీ పారామెడికల్ ఆప్తామాలిక్ ఆఫీసర్ ఎం.దివ్య అన్నారు. సోమవారం చాటపర్రు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జాతీయ అంధత్వ నివారణా కార్యక్రమంలో కంటి వైద్య పరీక్షలు చేశారు. విద్యార్థుల కళ్ల సంబంధించి పలు సూచనలు అందించారు. ఎంపీహెచ్‌ఈఓ రామాంజనేయులు, ఏఎన్ఎం భారతి, హెల్త్ అసిస్టెంట్ మురళి, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

ప్రభుత్వ విధానాలపై అంగన్‌వాడీల నిరసన



కొయ్యలగూడెం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం.



బుట్టాయగూడెం: సీడీపీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కొయ్యలగూడెం: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫోన్ సమస్యలు, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఒత్తిడి, సరుకుల పంపిణీలో అవాంతరాలపై నిరసన వ్యక్తం చేస్తూ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం ధర్నా నిర్వహించారు. సుమారు నాలుగేళ్ల క్రితం అంగన్‌వాడీలకు అందజేసిన ఫోన్లలో తొంభై శాతం చెడిపోయాయని, యాప్‌లు ఉపయోగించడానికి అవసరమైన నెట్‌వర్క్ స్పీడ్ లేకపోవడంతో పాటు, మారుమూల గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో సిగ్నల్స్ అందుబాటులో లేకుండా ఉన్నాయని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ, లబ్ధిదారుల రిజిస్ట్రేషన్, సరుకుల పంపిణీ వంటివి పూర్తిగా ఆన్‌లైన్ ద్వారానే జరగాలని అధికారులు ఒత్తిడి చేయడం వల్ల ప్రీ-స్కూల్ కార్యక్రమాలు దెబ్బతింటున్నాయని వారు ఆరోపించారు. ప్రభుత్వం ప్రీ-స్కూల్ బలోపేతం చేస్తామని మాటల్లో చెబుతున్నప్పటికీ, ఆచరణలో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరి చేసి, రిజిస్టర్ చేయకపోతే సరుకులు ఇవ్వబోమని బెదిరిస్తోందని కార్యకర్తలు విమర్శించారు. దీనివల్ల భవిష్యత్తులో అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే లబ్ధిదారుల సంఖ్య, ముఖ్యంగా పిల్లలు తగ్గిపోయే ప్రమాదం ఉందని వారు హెచ్చరించారు. గతంలో వలె లబ్ధిదారుల సంతకాలతో సరుకులు పంపిణీ చేసే విధానాన్ని పునరుద్ధరించాలని, గర్భిణులు, బాలింతలు, పిల్లలు, అంగన్‌వాడీలకు ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్) రద్దు చేయాలని కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో జిల్లా కార్యదర్శి భారతి, ప్రాజెక్టు నాయకులు శివ రత్నకుమారి, పీఎల్ఎస్ కుమారి, నాగవేణి, సెక్టార్ నాయకులు సత్యవేణి, ధనలక్ష్మి, సీత, శ్రీదేవి పాల్గొన్నారు.

యాప్‌లను రద్దు చేయాలి

చింతలపూడి: ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర నాయకత్వం పిలుపులో భాగంగా స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు వద్ద అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షురాలు ఎస్ సరోజిని, జిల్లా నాయకురాలు టి మాణిక్యం మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలు, చిన్న పిల్లలకు ఆహారం, ఆరోగ్యం అందించాలి గాని పోషణ ట్రాక్ యాప్, బాల సంజీవని యాప్ తీసుకొచ్చి లబ్ధిదారులను అంగన్‌వాడీ సెంటర్లకు దూరం చేసే విధానాలు అమలు చేస్తున్నారని విమర్శించారు. ఈకేవైసీ చేసి ఫొటో క్యాప్చర్ చేస్తేనే సరుకులు ఇవ్వాలని పెట్టిన నిబంధనను తొలగించాలని, గతంలో వలె లబ్ధిదారులకు సంతకం పెట్టించుకుని సరుకులు ఇవ్వాలని, ఎఫ్ఆర్ఎస్ యాప్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇన్‌చార్జి సీడీపీఓకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు నత్తా వెంకటేశ్వరరావు, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు పాండురంగారావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ధర్నా

బుట్టాయగూడెం: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సీడీపీఓ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం తమకు ప్రభుత్వం కేటాయించిన యాప్‌ల వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నామని అన్ని యాప్‌లను రద్దు చేసి ఒకే యాప్‌ను పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకురాళ్లు, తదితరులు పాల్గొన్నారు.